సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం ; 22 ; జూలై ; 2024



సోమశిలలో 9.743 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 9.743 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు, ఇతర కాలువలకు 210 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.75,700
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,780
3శాతం జీఎస్టీతో	రూ.6,983
నవర (8 గ్రా)	రూ.55,864

గరిష్ఠం/కనిష్ఠం
35.1 /26.2

వాతావరణం

జిల్లాలో సోమవారం అక్కడక్కడ ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉండి, పగలు వేడిగా ఉంటుంది. వాతావరణంలో తేమ 89 శాతం ఉంది.

న్యూస్‌రీల్

25న వెంగమాంబకు నెలపొంగళ్లు



వెంగమాంబ దేవస్థానం

దుత్తలూరు: మండలంలోని నర్రవాడలో కొలువైన వెంగమాంబ పేరంటాలు అమ్మవారి నెల పొంగళ్లు ఈ నెల 25న నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఉషశ్రీ తెలిపారు. గత నెల 23 నుంచి 27వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగాయి. 26న వెంగమాంబ-గురవయ్య దంపతుల కల్యాణం నిర్వహించారు. కల్యాణం జరిగిన రోజు నుంచి 30వ రోజు నెల పొంగళ్లు జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. నెల పొంగళ్లకు భక్తులు భారీ స్థాయిలో హాజరవుతారనే అంచనాతో దేవదాయశాఖ అధికారులు, వ్యవస్థాపక ధర్మకర్తలు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. నెల పొంగళ్ల రోజున భక్తులు అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పిస్తారు. పోలీసులు భద్రతా ఏర్పాటు చేస్తున్నారు.

పోలీస్ సేవలు ప్రశంసనీయం

- ఎస్పీ జి.కృష్ణకాంత్



మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): బారాషహీద్ దర్గాలో ఐదు రోజుల పాటు జరిగిన రొట్టెల పండగ ఆదివారంతో ముగిసింది. సమర్థవంతంగా బందోబస్తు విధులు నిర్వహించిన సిబ్బందిని ఎస్పీ జి. కృష్ణకాంత్ అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ రెండు వేల మంది సిబ్బంది 24 గంటలూ విధుల్లో ఉంటూ దర్గాకు విచ్చేసిన భక్తులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశారన్నారు. బందోబస్తు విధులకు హాజరైన సిబ్బందితో పాటు ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రశాంత వాతావరణంలో పండగ ముగిసేలా చర్యలు తీసుకున్నామన్నారు. రద్దీలో తప్పిపోయిన 472 మంది చిన్నారులను సంరక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించామని చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులు దర్గా సందర్శనం, రొట్టెల మార్పిడికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించామన్నారు. క్రైమ్ పార్టీ పోలీసులు 17 మంది జేబు దొంగలను అదుపులోకి తీసుకుని 12 పర్సులు, రెండు సెల్‌ఫోన్లు, నగదు, దుస్తుల బ్యాగ్‌లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశామని తెలిపారు. ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ట్రాఫిక్‌కు అవాంతరాలు తలెత్తకుండా చూశారన్నారు. బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ భక్తులకు భరోసా కల్పించామని చెప్పారు. రొట్టెల పండగ విజయవంతం చేయడంలో సహకరించిన అన్ని విభాగాల అధికారులు ఉద్యోగులు, భక్తులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్రమశిక్షణ, సమయపాలనతో బందోబస్తు విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.

ఎల్‌ఎల్‌బీ ఫలితాల విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన ఎల్‌ఎల్‌బీ కోర్సుకు సంబంధించిన మూడు, ఏడో సెమిస్టర్ ఫలితాలు ఆదివారం విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఆదిపరాశక్తికే శఠగోపం

రూ.8 కోట్ల మేర కామాక్షమ్మ సొమ్ము స్వాహా

- ప్రసాదాల్లా తినేసిన ఈఓలు, మాజీ చైర్మన్
- అప్పుల ఊబిలో జొన్నవాడ కామాక్షితాయి ఆలయం
- ఆరేళ్ల జమ, ఖర్చులపై రహస్యంగా విచారణ

ఆదిపరాశక్తి కామాక్షితాయికే ఇద్దరు ఈఓలు, ఓ మాజీ చైర్మన్ శఠగోపం పెట్టారు. భక్తులు భక్తితో హుండీల్లో సమర్పించిన కానుకలను కలిసి భోక్తం చేశారు. ప్రతి పైసా అమ్మవారికే చెందాలనే నిబంధనలు పెట్టి.. భక్తులు వేదపండితుల ఆశీర్వాదం తీసుకుని హారతి పళ్లెంలో వేసిన కానుకలను సైతం ఖజానాకు మళ్లించి కాజేశారు. దేవదేవేరుల నిత్య కైంకర్యాలు, సేవలు, ఆలయ అభివృద్ధి, అన్నదానం తదితర అవసరాల కోసం దాతలు సమర్పించిన విరాళాలనూ ప్రసాదాల్లా మింగేశారు. బ్యాంక్ బ్యాలెన్స్‌లతో నిండుగా ఉన్న ఖజానాను ఖాళీ చేసి అప్పుల ఊబిలో కూర్చేశారు.

సాక్షి నెల్లూరు ప్రతినిధి: ఆలయ పాలకులే.. భక్షకులుగా మారారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఆదిపరాశక్తి జొన్నవాడ కామాక్షితాయి సొమ్ము రూ.8 కోట్లు గుట్టుగా మింగేశారు. కోటి కుంకుమార్చన, మహా కుంభాభిషేకం, బ్రహ్మోత్సవాలు, అన్నదాన నిర్వహణ, ప్రసాదాల తయారీ, ఫలసరుకుల కొనుగోలు పేరుతో గతంలో పని చేసిన ఇద్దరు ఈఓలు, మాజీ చైర్మన్ కాజేసిన వైనంపై డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారి నేతృత్వంలో మూడు రోజులుగా రహస్యంగా విచారణ జరపడంతో ఈ విషయం వెలుగు చూసింది. రూ.లక్షల్లో బ్యాంక్ బ్యాలెన్స్‌లు ఉన్న ఆలయ ఖజానాను ఖాళీ చేసి, అంతే స్థాయిలో అప్పులు చూపించడంతో ఆలయంలో దేవదేవేరులకు నిత్య కైంకర్యాల నిర్వహణ సైతం కష్టంగా మారింది. మూడు రోజుల పాటు జరిగిన విచారణలో నిలువెత్తు మోసాలు, రూ.కోట్ల అవినీతి వెలుగు చూసినట్లు సమాచారం.

వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక

జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడ పెన్నా తీరంలో కొలువైన కామాక్షితాయి దర్శన భాగ్యం కోసం జిల్లాలోని ప్రజలే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల భక్తులు పరితపిస్తుంటారు. ఆదిపరాశక్తికి ప్రణమిల్లి ప్రార్థించడానికి సామాన్యుడి నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, న్యాయమూర్తులు వంటి అత్యున్నత స్థాయి హోదాలోని భక్తులు సైతం భక్తిప్రపత్తులతో వస్తారు. కామాక్షితాయి అమ్మవారు ఎంతో ఆగ్రహపరురాలో.. అంతే అనుగ్రహమూర్తి. అటువంటి ఆదిపరాశక్తి సొమ్మునే ప్రసాదాల్లో పాలకుల పేరుతో తినేశారు.

రూ.66 లక్షల బ్యాలెన్స్ నుంచి రూ.45 లక్షల అప్పులు

ప్రస్తుతం జొన్నవాడ కామాక్షితాయి ఆలయ ఈఓగా ఉన్న శ్రీనివాసులురెడ్డి గతంలో కూడా ఈఓగా పనిచేశారు. ఆయన ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. కరోనా విపత్కర సమయంలో కూడా రూ.66 లక్షల సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. నిజాయతీగా పనిచేస్తున్న ఈ అధికారితో తన అవినీతి సాగడం లేదని అప్పట్లో ఆలయ చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి గ్రహించారు. ఈ క్రమంలో తన పరపతి ఉపయోగించి బదిలీ చేయించారు. ఇటీవల వరకు ఆలయ చైర్మన్‌గా కొనసాగిన ఆయన తర్వాత వచ్చిన ఈఓలతో కలిసి ఫిక్స్‌డ్ డిపాజిట్ మొత్తాన్ని ఖాళీ చేయడమే కాకుండా, ఆ తర్వాత కాలంలో భక్తులు సమర్పించిన కానుకలు, విరాళాలతో పాటు మరో రూ.45 లక్షల మేర అప్పులు చేశారు. దాదాపు ఆరేళ్లుగా ఆలయ చైర్మన్‌గా ఉన్న సదరు వ్యక్తితో పాటు ఇద్దరు ఈఓలు సుమారు రూ.8 కోట్ల మేర ఆదిపరాశక్తి సొమ్మును స్వాహా చేసినట్లు విచారణలో వెలుగు చూసింది.



జొన్నవాడ కామాక్షితాయి ఆలయం

వేదపండితుల హారతి పళ్లాల్లోని సొమ్ములు సైతం..

ఆలయానికి భక్తులు సమర్పించిన కానుకలు కాజేసిన మాజీ చైర్మన్, ఈఓలు చివరకు వేదపండితుల ఆశీర్వాదం తీసుకుని భక్తులు హారతి పళ్లాల్లో సమర్పించిన కానుకలను కూడా హుండీల్లో వేయించి కాజేశారు. హారతి పళ్లాల్లో భక్తులు ఇచ్చిన కానుకలను హుండీల్లో వేయించేందుకు వీలుగా నిబంధనలను అతిక్రమించి అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 70 మందిని ప్రైవేట్ వ్యక్తులను నియమించారు. నీతివంతంగా, ధర్మబద్ధంగా వ్యవహరిస్తున్నామని సమాజాన్ని నమ్మిస్తూ ఆలయ సొమ్మును దిగమింగిన వైనాన్ని తెలుసుకుని విచారణాధికారులు కంగుతిన్నారు.



ఈఓ ఫిర్యాదుతో విచారణ

ప్రస్తుతం ఈఓగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులురెడ్డి ఆలయంలో జరిగిన అవినీతిని గుర్తించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ బాధ్యతలు విజిలెన్స్‌కు అప్పగిస్తే మసిపూసి మారేడు కాయ చేసే అవకాశాలు ఉన్నాయని గుర్తించిన దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఆ శాఖలో నిజాయతీ అధికారిగా పేరున్న డిప్యూటీ కమిషనర్‌ను విచారణాధికారిని నియమించారు. ప్రస్తుత ఈఓ సమక్షంలో 2018 నుంచి 2024 వరకు ఆరేళ్ల కాలంలో జరిగిన జమా ఖర్చుల లెక్కలు తీశారు. డిప్యూటీ కమిషనర్‌తో పాటు మరో ఆరుగురు సిబ్బంది ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు విచారణ నిర్వహించి రికార్డులు పరిశీలించారు.

కళ్లు బైర్లు కమ్మే అవినీతి

ఆలయంలో కోటి కుంకుమార్చన, మహా కుంభాభిషేకం, బ్రహ్మోత్సవాలు, అన్నదాన నిర్వహణ, ప్రసాదాల తయారీ, ఫలసరుకుల కొనుగోలు, అవుట్ సోర్సింగ్ ద్వారా ఇబ్బడి ముబ్బడిగా సిబ్బంది ఏర్పాటు ఇలా ప్రతి చోట కళ్లు బైర్లు కమ్మే రీతిలో అవినీతి జరిగినట్లు విచారణలో నిగ్గు తేలినట్లు తేటతెల్లమైంది. నిర్వహణ బడ్జెట్‌ను ఏడాదికి ఏడాదికి అలవి కాకుండా పెంచి తినేశారు. నకిలీ బిల్లులు పెట్టి అమ్మవారి సొమ్మును నిలువు దోపిడీ చేశారు. భక్తుల నుంచి ఎంత స్వీకరించారు.. అవి ఎక్కడ జమ చేశారనే విషయాలు తెలుసుకుని విచారణాధికారులే నివ్వెరపోయారు. భక్తుల నుంచి స్వీకరించిన కానుకలు ఆలయ ఖాతాలో జమ చేస్తే ఈజీగా తినడానికి ఇబ్బంది ఉంటుందని బ్యాంకు ఖాతాకు బదులు బినామీల దగ్గర దాచారు. అన్నదాన నిర్వహణకు భక్తులు ఇచ్చే విరాళాలను, కందువాల కొనుగోళ్ల లెక్క చూసి విచారణాధికారులకే కళ్లు బైర్లు కమ్మాయి. అన్నదానం కోసం ఫలసరుకులు, ప్రసాదాల సరుకులు కొనుగోళ్లలోనూ మితిమీరిన అవినీతి చోటుచేసుకుంది. అలవెన్సుల పేరిట దోపిడీ చేశారు. అవినీతి అవకతవకలు వెలుగులోకి రాకుండా ఉండేందుకు జిల్లాలో దేవదాయశాఖ అధికారులకు బాగానే ముట్టజెప్పినట్లు సమాచారం. ఇంతటి ప్రసిద్ధ ఆలయంలో రూ.కోట్ల అవినీతి జరుగుతున్నా.. స్థానిక మీడియా నోర్లు కొప్పేట్టేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడు రోజుల పాటు అవినీతిని నిగ్గు తేలుస్తుంటే మీడియా, బాహ్య ప్రపంచానికి తెలియనివ్వకుండా విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో రూ.8 కోట్ల మేర అవినీతి జరిగినట్లు తేలిన నేపథ్యంలో బాధ్యులైన మాజీ చైర్మన్, ఈఓల నుంచి రికవరీ చేస్తారా? లేకుండా మాఫీ చేస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మళ్లొస్తాం..



దర్గాలో బారాషహీదుల సమాధులను దర్శించుకుంటున్న భక్తులు

విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, సౌభాగ్యం, గృహం ఇలా కోరిన కోరికలు తీరాలంటూ ఐదు రోజుల పాటు స్వర్ణాల చెరువులో రొట్టెలు మార్చుకుంటూ భక్తి భావాన్ని నింపుకున్నారు. కోరికలు తీరితే వచ్చే ఏడాది మళ్లీ వస్తానంటూ మొక్కుకున్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన వరాల పండగ ఈ నెల 17వ తేదీన ప్రారంభమై ఆదివారంతో ముగిసింది. రాష్ట్రం నుంచే కాకుండా దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు బారాషహీద్ దర్గాకు తరలివచ్చారు.

- ముగిసిన రొట్టెల పండగ
- లక్షలాది మంది భక్తుల రాక
- చివరి రోజూ కొనసాగిన భక్తుల రద్దీ
- నిరంతరం పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ
- శ్రమించిన అధికారులకు సత్కారం

నెల్లూరు (బారకాసు): ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రొట్టెల పండగకు ఈ ఏడాది కూడా లక్షలాది మంది భక్తులు తమ కోర్కెలు నేరవేరాలని నమ్మకంతో వచ్చారు. గతేడాది కోరికలు తీరిన భక్తులు రొట్టె వదిలి మరో కోరిక రొట్టెలను పట్టుకున్నారు. ఈ ఏడాది అధికంగా ఆరోగ్యం, వివాహం, ఉద్యోగం, పదోన్నతి, ధనం, వ్యాపార, స్వగృహ రొట్టెలను దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఈ నెల 17న షహదత్, 18న గంధమహోత్సవం, 19 రొట్టెల పండగ, 20 తహలీల్ ఫాతేహా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా గంధమహోత్సవం వైభవంగా జరిగింది. లక్షలాది మంది భక్తులు గంధం దక్కించుకొనేందుకు పోటీ పడ్డారు. దేశ నలుమూలల నుంచే కాక విదేశాల నుం కూడా భక్తులు వచ్చి వరాల రొట్టెలను పట్టుకున్నారు.

ఐదో రోజూ..

బారాషహీద్ దర్గాలో ఐదో రోజూ ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. సెలవు దినం కావడంతో నగరవాసులతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో రద్దీ కొనసాగింది. స్వర్ణాల తీరం జనసందడితో కళకళలాడింది. అనంతరం దర్గాలోని షహీద్‌ల సమాధులను దర్శించుకుని తమ కోరికలు ఫలించాలంటూ ప్రార్థనలు చేశారు.



దర్శనానికి బయట బారులు తీరిన భక్తులు

అధికారుల సమన్వయం భేష్

రొట్టెల పండగ సందర్భంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేసింది. కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ సేదుమాధవన్, ఎస్పీ కృష్ణకాంత్‌తో పాటు కార్పొరేషన్ అధికారులు చక్కటి ప్రణాళికతో అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ నిరంతరం సమీక్షించుకుంటూ భక్తులకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా వ్యవహరించారు. నిరంతరాయంగా సీసీ కెమెరాల ద్వారా పోలీసు విభాగం కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించారు. వైద్య శిబిరాలను కొనసాగించారు.

అధికారులకు సత్కారం

సాయంత్రం దర్గా ప్రాంగణంలోని ఏపీ టూరిజం పార్కు ఆవరణలో ఫెస్టివల్ కమిటీ ఆధ్వర్యంలో రొట్టెల పండగ ముగింపు సభను ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. రొట్టెల పండగ నిర్వహణలో క్రియాశీలక పాత్ర పోషించిన అధికారులకు సత్కారం లభించింది. ఆయా విభాగాల అధికారులకు జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు. ముగింపు కార్యక్రమంలో దర్గా కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా, ఏఎస్పీ శ్రీనివాసరెడ్డి, అడిషనల్ కమిషనర్ శర్మద, సిటీ ప్లానర్ దేవీకుమారి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర





- ఆకట్టుకున్న దేవతా ప్రతిమలు
- ఉత్సాహంగా నృత్యాలు చేసిన మహిళలు, చిన్నారులు

ఆత్మకూరు: రామభక్త హనుమంతుడిని తలచుకుంటూ హనుమాన్ శోభాయాత్రను ఆదివారం ఆత్మకూరులో అంగరంగ వైభవంగా నిర్వహించారు. బైపాస్‌రోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన హనుమాన్ శోభాయాత్ర రవితేజ కల్యాణ మండపం, పాత సినిమా హాలు మీదుగా సత్రం సెంటర్, మెయిన్ బజార్, చావడి, హిల్‌రోడ్డు, ఎరుకలసానినగర్, సోమశిల రోడ్డు సెంటర్, ఎల్ఆర్‌పల్లి, ఆర్టీసీ బస్టాండ్ తిరిగి మెయిన్ రోడ్డు మీదుగా మున్సిపల్ బస్టాండ్, దళితకాలనీల మీదుగా రవితేజ కల్యాణ మండపం వద్దకు చేరుకుంది. ఈ శోభాయాత్రలో ప్రత్యేక వాహనాలపై ఏర్పాటు చేసిన హనుమంతుడు, శ్రీరాముడు, సీతారామ, లక్ష్మణ, పట్టాభిషేకం విగ్రహాల అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. సుమారు 4 గంటల పాటు సాగిన ఈ శోభాయాత్రలో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీజే సంగీతానికి యువకులు, మహిళలు, చిన్నారులు చేసిన కోలాటం నృత్యం, పండరీ భజన ఆకట్టుకున్నాయి. డీఎస్పీ ఎన్ కోటారెడ్డి, సీఐ జి వేణు, ఎస్సై ముత్యాలరావుతో పాటు వివిధ పోలీసు స్టేషన్ల ఎస్సైలు, పోలీసులు బందోబస్తు పర్యవేక్షణ చేశారు. శోభాయాత్రను చూసేందుకు పలు సెంటర్ల వద్ద మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆసక్తిగా చూడడం కనిపించింది. శోభాయాత్ర అనంతరం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు.



ధీమా ఇవ్వని హామీ

- ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల గడుస్తున్నా.. సాయం విడుదల చేయని ప్రభుత్వం
- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ
- అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోని ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో సీజన్‌కు ముందే క్రమం తప్పకుండా అందించిన రైతు భరోసా

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటిపోయింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు సాగు పెట్టుబడి సాయం అందక ధీమా కోల్పోయారు. పెట్టుబడి సాయంపై నూతన ప్రభుత్వంలో ఇంత వరకు చలనం లేకపోగా, మరో పక్క బ్యాంకు నుంచి రుణాలు ఆలస్యంతో రైతులు పంటల సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతు భరోసా పేరుతో రైతులకు ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందేది. ప్రభుత్వం మారడంతో ఆ సాయంపై నీలినీడలు అలుముకున్నాయి. ఎన్నికలకు ముందు ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామని చెప్పినా ఇంత వరకు ఆ దిశగా ప్రభుత్వం కనీసం మార్గదర్శకాలు కూడా రూపొందించలేదు.

కందుకూరు: సాధారణంగా ఏడాదిలో వ్యవసాయ సీజన్ ఖరీఫ్‌తోనే ప్రారంభమవుతోంది. ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి అక్టోబర్ వరకు ఉంటుంది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఖరీఫ్ పంటల సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో మెట్ట పంటలు కంది, పెసర, మినుము వంటి తదితర పంటలతో పాటు మాగాణి సాగును రైతులు పెద్ద ఎత్తున చేపడుతారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 70 వేల హెక్టార్లలో పంటలు సాగు చేపడుతున్నారు. వీరిలో ఎక్కువగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయంపై ఇప్పటి వరకు దృష్టి పెట్టలేదు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇవాల్సిన పెట్టుబడి సాయాన్ని ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. మరో పక్క బ్యాంకులకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వ్యవసాయ రుణ ప్రణాళిక అందడం ఆలస్యం కావడం వల్ల రైతులకు రుణాలు రీషెడ్యూల్ చేయలేదు. దీంతో బ్యాంకుల్లో కూడా రైతులకు కొత్త రుణాలు మంజూరు కావడం ఆలస్యమవుతుంది. ఖరీఫ్ సీజన్ ముమ్మరంగా సాగుతున్న తరుణంలో రైతులు సాగు ఖర్చుల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు.



దుక్కి దున్నుతున్న రైతు

గతంలో ఐదేళ్లూ ఇలా..

సంవత్సరం	మొత్తం రైతులు	ఆర్థిక సాయం (రూ. కోట్లలో)
2019-20	2,02,308	రూ 273.11
2020-21	2,43,502	రూ 328.72
2021-22	2,43,911	రూ 329.27
2022-23	2,14,667	రూ 289.80
2023-24	2,14,667	రూ 289.80

గతంలో సీజన్ కంటే ముందే సాయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు అకౌంట్‌ల్లో రైతుభరోసా కింద పెట్టుబడి సాయం జమయ్యేది. జూన్‌లో ప్రారంభమయ్యే ఖరీఫ్‌కు మే నెలలోనే రూ.7,500 చొప్పున ప్రతి రైతుకు అందేది. రబీ సీజన్ ప్రారంభంలో అంటే అక్టోబర్‌లో రూ.4 వేలు, జనవరి నెలలో మరో రూ.2 వేల సాయాన్ని ప్రభుత్వం క్రమం తప్పకుండా అందించేది. గత ఐదేళ్లుగా సీజన్ల వారీగా ప్రతి రైతుకు ఏడాదికి రూ. 13,500 సాయం అందేది. భూమిలేని కౌలు రైతులకు, దేవదాయ, వక్ఫ్ వంటి ఇతర భూములను సాగు చేసుకుంటున్న వారికి కూడా ప్రభుత్వం సాయం అందించింది. ఇలా ఐదేళ్ల పాటు జిల్లా వ్యాప్తంగా 2.14 లక్షల మంది రైతులకు రూ.1510.70 కోట్లు అందించింది.

సీజన్ ప్రారంభమై నెలవుతున్నా సాయమేది?

ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఒకలా, అధికారంలోకి వచ్చిన తర్వాత మరోలా ప్రభుత్వ వ్యవహార శైలి ఉంది. ఎన్నికలకు ముందు ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తామని స్పష్టంగా ప్రకటించారు. అయితే సీఎం చంద్రబాబునాయుడు దీనిపై నోరు మెదపడం లేదు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనా రైతులకు ఇస్తామన్న రూ. 20 వేల సాయంపై స్పష్టమైన ప్రకటన ప్రభుత్వం నుంచి రాలేదు. దీంతో ఈ పథకం నుంచి ఎప్పుడు అమలు అవుతుందో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులు ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలను ఆశ్రయిస్తున్నారు.

సాయం విడుదల చేయాలి



రైతులకు ప్రభుత్వం ఇస్తామన్న సాయాన్ని వెంటనే విడుదల చేయాలి. ఇప్పుడు వ్యవసాయ పనులు మొదలు పెట్టాం. పంటల సాగుకు అవసరమయ్యే పెట్టుబడుల కోసం బ్యాంకులను, ప్రైవేట్ వ్యక్తుల వద్దకు పోవాల్సి వస్తుంది. కొత్త ప్రభుత్వం చెప్పిన ప్రకారం రైతులకు రూ. 20 వేలు ఇవ్వాలి.

– సూరా పుల్లారెడ్డి, పోలినేనిచెరువు

పెట్టుబడులకు ఇబ్బందులు



పంటల సాగు ప్రారంభం కావడం వల్ల పెట్టుబడుల కోసం కొంత ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వ కాలంలో పంటల సాగు మొదలవగానే మాకు అకౌంట్లో డబ్బులు పడేవి. దాని వల్ల ఎరువులు, విత్తనాలు వంటివి కొనుగోలు చేసేందుకు ఆసరాగా ఉండేది. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి సాయం అందలేదు.

– పి. వెంకటేశ్వర్లు, అంకభూపాలపురం





రొట్టె స్వీకరిస్తూ..



రొట్టెలు అందుకున్న మహిళలు

పోటెత్తి.. వరాల రొట్టెలు పట్టి..

నెల్లూరులో ఈనెల 17వ తేదీన ప్రారంభమైన రొట్టెల పండగ ఆదివారంతో ముగిసింది. చివరిరోజు భక్తులు పోటెత్తారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన వారితో బారాషహీద్ దర్గా కిటకిటలాడింది. స్వర్ణాల ఘాట్‌లో అనేకమంది కోర్కెల రొట్టెలు స్వీకరించి సంతోషంగా తిరుగు ప్రయాణమయ్యారు. – సాక్షి ఫొటోగ్రాఫర్



స్వర్ణాల ఘాట్‌లో యువతులు

ఇంట్లోకి చొరబడి వివాహితపై దాడి

- గొలుసు చోరీకి యత్నం
- నెల్లూరులో దారుణం

నెల్లూరు(క్రైమ్): పట్టపగలు వివాహిత ఒంటరిగా ఉందని గమనించిన ఓ యువకుడు ఇంట్లోకి చొరబడి ఆమెపై దాడి చేసి గొలుసు చోరీకి యత్నించాడు. బాధితురాలు పెద్దగా కేకలు వేయడంతో అతను పరారయ్యాడు. ఈ ఘటన ఆదివారం వెలుగు చూసింది. నెల్లూరు చిన్నబజారు పోలీసుల కథనం మేరకు.. మూలాపేట అలంకార్ సెంటర్ సమీపంలోని పెన్షన్ లైన్‌లో మహేంద్ర, గాయత్రి దంపతులు నివాసం ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం గాయత్రి ఇంట్లో పనులు చేసుకుంటుండగా గుర్తుతెలియని యువకుడు అక్రమంగా లోపలికి ప్రవేశించాడు. గాయత్రి మెడలోని గొలుసును లాగే ప్రయత్నం చేయగా ప్రతిఘటించడంతో కోపోద్రిక్తుడైన దుండగుడు దాడి చేశాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు రావడాన్ని గమనించిన అతను పరారయ్యాడు. గాయాలపాలైన గాయత్రి ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడు ఖాకీ కుమారుడు?

మహిళపై దాడి చేసిన వ్యక్తి ముత్తుకూరుకు చెందిన ఓ పోలీసు కుమారుడని తెలిసింది. నిందితుడు కృష్ణపట్నం పోర్టులో పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. గతంలో వారు నెల్లూరులో నివాసం ఉన్నారు. సదరు యువకుడు వ్యసనాలకు బానిసయ్యాడు. శనివారం ఫూటుగా మద్యం తాగి వివాహిత ఇంట్లోకి ప్రవేశించి చోరీకి యత్నించినట్లు తెలిసింది. బాధితురాలి ఫిర్యాదుతో అప్రమత్తమైన చిన్నబజారు పోలీసులు సాంకేతికత ఆధారంగా నిందితుడిని గుర్తించి బుచ్చిరెడ్డిపాళెంలో అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

శాంతిభద్రతలు గాలికి..

జిల్లాలో పోలీసు గస్తీకి సుస్తీ చేసి శాంతిభద్రతలు గాల్లో దీపంలా మారాయి. హత్యాయత్నాలు, దొంగతనాలు నిత్యకృత్యంగా మారాయి. కామాంధులు లైంగికదాడులకు పాల్పడుతున్నారు. గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మత్తులో యువత నేరాలకు పాల్పడుతోంది. విక్రయాల కట్టడిలో పోలీసులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గడిచిన 20 రోజుల వ్యవధిలో రూ.1.50 కోట్లకు పైగా సొత్తును దుండగులు అపహరించారు. మూడు హత్యలు జరిగాయి. వరుస ఘటనలు ప్రజలను కలవరపాటుకు గురిచేస్తున్నాయి.

జిల్లాలో పెరిగిన నేరాలు

- రోజూ ఏదో ఒకచోట దొంగతనం
- 20 రోజుల వ్యవధిలో రూ.1.50 కోట్లకు పైగా సొత్తు చోరీ
- మూడు హత్యలు.. మూడు లైంగికదాడులు





వరికుంటపాడులో జరిగిన దొంగతనం గురించి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో ఐదు సబ్‌డివిజన్లు, 12 సర్కిల్స్ పరిధిలో 52 పోలీస్‌స్టేషన్లు, 11 అర్బన్ పోలీస్‌స్టేషన్లున్నాయి. వాటి పరిధిలో కొద్దికాలంగా పోలీసు గస్తీ అంతంతమాత్రంగానే మారడం నేరస్తులకు కలిసొచ్చింది. దీంతో యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతున్నారు. గుడి, బడి అనే తేడా లేకుండా దొంగలు విజృంభించి అందినకాడికి దోచుకెళ్తున్నారు. పాతకక్షల నేపథ్యంలో పగటిపూటే హత్యలకు తెగబడుతున్నారు. రౌడీషీటర్లు, పాతనేరస్తులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా కొరవడడంతో నేరాలు పెరుగుతున్నాయి. ఓ కేసులో పోలీసులు నిమగ్నమై ఉండగా మరోచోట నేరాలకు పాల్పడుతూ సవాల్ విసురుతున్నారు. నేర నియంత్రణపై పోలీసులు పూర్తిస్థాయిలో దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నేరం జరిగిన తర్వాత ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి నిందితులను అరెస్ట్ చేయడం కంటే నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల ఆస్తికి నష్టం వాటిల్లే అవకాశం ఉండదు. ఆ దిశగా పోలీసు బాస్ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాబోయ్ దొంగలు

గడిచిన 20 రోజుల వ్యవధిలో దొంగలు హల్‌చల్ చేశారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని అందినకాడికి దోచుకెళ్లారు. ఈనెల రెండో తేదీ రాత్రి సంగం మండలంలో మూడు గృహాల్లో దొంగతనాలు చేసి పెద్దఎత్తున నగదు, ఆభరణాలను అపహరించారు. కావలిలో ఆగి ఉన్న బస్సులో నిందితులు రూ.80 లక్షల నగదును సినీ ఫక్కీలో దోచుకున్నారు. ఉదయగిరి పరిధిలోని దాసరపల్లిలో సయ్యద్ అమీరుల్లాను ఏమార్చి అతని జేబులో ఉన్న రూ.8 వేలను దోచుకెళ్లారు. ఆత్మకూరు పట్టణంలో చిరునామా అడుగుతున్నట్లు నటించి సిద్దమ్మ మెడలోని సుమారు మూడు సవర్ల బంగారు సరుడును తెంపుకెళ్లారు. ఏఎస్‌పేట మండలంలో రెండు సవర్ల బంగారు సరుడు లాక్కెళ్లారు. అల్లూరు మండలం సింగపేటలో కె.రమణమ్మ ఇంట్లో 22 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు, అల్లూరు మండలంలో శ్రీనివాసులరెడ్డి ఇంట్లో రూ.1.75 లక్షల నగదు, 15 సవర్ల బంగారం అపహరించుకెళ్లారు. ఈనెల 17వ తేదీ రాత్రి వరికుంటపాడు, ఉదయగిరిల్లో పలు ఇళ్లల్లో నగదు, బంగారు ఆభరణాలు, బైక్‌లను దొంగతనం చేశారు. కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళ వద్ద రూ.లక్ష నగదు, మర్రిపాడు మండలంలోని కంద్రిక గ్రామంలో ఓ ఇంట్లో కిలో వెండి, రూ.65 వేల నగదు, కోవూరులోని గుమ్మలదిబ్బ ప్రాంతంలో పది సవర్ల బంగారం చోరీకి గురైంది. అపహరణకు గురైంది. ఇప్పటి వరకు 80 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.98 లక్షలకుపైగా నగదు దోచినట్లు అంచనా.

ఆలయాలకు భద్రత కరువు

దొంగతనానికి కాదేదీ అనర్హమంటూ ఆలయాలను చోరులు వదలడం లేదు. జిల్లాలో 13 ప్రధాన, మరో 1,300 ఆలయాలున్నాయి. ఆరు ప్రధాన దర్గాలు, 600 ఇతర దర్గాలు, 705 మసీదులు, 800కు పైగా చర్చిలు ఉన్నాయి. వీటన్నింటికీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని గతంలో పోలీసు శాఖ ఆలయాలు, దర్గా, చర్చి కమిటీలకు సూచించింది. పలు చోట్ల ఇంకా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంతో నేరగాళ్లు చోరీలకు పాల్పడుతూనే ఉన్నారు. గంగవరంలోని ఓ ఆలయంలో రూ.లక్ష విలువైన అమ్మవారి ఆభరణాలను అపహరించారు. కాకుటూరులోని జైన్ దేవాలయంలో రూ.లక్షల విలువచేసే ఆభరణాలను దుండగులు దోచుకెళ్లారు.

బరితెగించి..

పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని చందు అనే వ్యక్తి తన స్నేహితులతో కలిసి రామకోటయ్యనగర్‌లో నీతిరాజును పట్టపగలు హత్య చేశారు. కోవూరులో వెంకటేశ్వరపురం గాంధీగిరిజనకాలనీకి చెందిన నాగరాజును సన్నిహితులే హతమార్చారు. మద్యం మత్తులో నెలకొన్న వివాదంతో నారాయణ మెడికల్ హాస్పిటల్ ప్రాంగణంలో రవిగౌర్‌ను సహచరుడు లాల్‌మోహన్ చంపాడు. గుడ్లూరు మండలంలోని శాంతినగర్ జామాయిల్ తోటలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఇక హత్యాయత్నాలు లెక్కకు మించి జరిగాయి. రౌడీషీటర్లు, పాతనేరస్తులు బరితెగించి దాడులకు పాల్పడుతున్నారు.



- భార్యపై కక్షతో కుమార్తెపైనే మారుతండ్రి లైంగికదాడి చేశాడు. విడవలూరులో ప్రేమ పేరిట నమ్మించి ఓ వ్యక్తి బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. దివ్యాంగురాలిపై రాపూరులో ఓ వ్యక్తి అఘాయిత్యం చేశాడు. పోలీసు రికార్డులకెక్కని ఘటనలు అనేకం ఉన్నాయి.

కట్టడి చేయాలి



పాతనేరస్తులను అరెస్ట్ చేసి సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్)

పోలీసులు ఇటీవల జరిగిన పలు కేసులను ఛేదించారు. హత్య కేసుల్లో నిందితులను అరెస్ట్ చేశారు. పాఠశాలల్లో, ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను అరెస్ట్ చేసి రూ.30 లక్షల సొత్తు, 16 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బస్సుల్లో చోరీ కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. నేరం జరిగిన తర్వాత హడావుడి చేయడం కంటే నేరాలను ముందస్తు కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజానీకం అభిప్రాయపడుతోంది.

అయితే అధిక శాతం కేసులు పెట్టేందుకు భయపడుతుండటంతో వారి ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. రౌడీషీటర్లపై పోలీసుల నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల దాడులు చేసి సుమారు ఎనిమిది మందిని అరెస్ట్ చేసి 6 కేజీలను స్వాధీనం చేసుకున్నారు. దీనిని బట్టి చూస్తే గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

కారు ఢీకొని వ్యక్తి మృతి



తిరుపతయ్య (ఫైల్)

మర్రిపాడు: మండలంలోని అచ్చమాంబ ఆలయ సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై ఆదివా రం మోటార్‌బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మర్రిపాడు మండలం కంద్రిక గ్రామానికి చెందిన విద్యా కమిటీ చైర్మన్ తిరుపతయ్య (36)కు వివాహమై ముగ్గురు సంతానం ఉన్నారు. తన పిల్లలతో మోటార్‌బైక్‌పై మర్రిపాడుకు వెళ్లాడు. వారు తిరిగి కంద్రికకు బయలుదేరారు. బైక్ అచ్చమాంబ ఆలయ సమీపానికి వచ్చింది. కొందరు కారులో నెల్లూరు రొట్టెల పండగకు వెళ్లారు. తిరిగి బద్వేల్ వైపు వెళ్తూ తిరుపతయ్య బైక్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తిరుపతయ్య కాలు తెగిపడింది. స్థానికులు గుర్తించి అతడిని నెల్లూరు జిల్లా వైద్యశాలకు తరలిస్తుండగా దారిలో మృతి చెందాడు. ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 6.277 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.277 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వెంటాడిన విధి

- పనికి వెళ్లి తీవ్రంగా గాయపడిన యువకుడు
- చికిత్స నిమిత్తం సాయం కోసం ఎదురుచూపు



చికిత్స పొందుతున్న ఇలియాస్



బాధితుడి బంధువులకు నగదు అందజేత

వింజమూరు(ఉదయగిరి): పుస్తకాలు పట్టుకుని కళాశాలకు వెళ్లాల్సిన వయస్సులో ఆ యువకుడు కుటుంబ పోషణ నిమిత్తం అద్దాలు లోడింగ్, అన్‌లోడింగ్ పనులకు వెళ్తున్నాడు. పని చేయగా వచ్చిన డబ్బుతో పొట్ట పోసుకుంటున్న తరుణంలో విధి అతడిపై చిన్నచూపు చూసింది. తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వింజమూరు పట్టణంలోని సుజాత నగర్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్ కుమారుడు ఇలియాస్ శనివారం అద్దాల దింపుతుండగా ఒకటి జారి గొంతుపై పడి తీవ్ర గాయమైంది. అక్కడి వారు వెంటనే స్పందించి ప్రథమ చికిత్స చేసి నెల్లూరుకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు చెన్నైలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కుటుంబసభ్యుల వద్ద చిల్లిగవ్వ లేకపోకపోవడంతో కన్నీరుమున్నీరయ్యారు. ఇలియాస్ మిత్రులు కొంత ఆర్థిక సహాయం చేసి వైద్యశాలలో చేర్పించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తన ట్రస్ట్ ద్వారా రూ.20 వేలిచ్చారు. మాజీ సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, అతని మిత్రులు రూ.40 వేలను ఆదివారం అందించారు. ఇంకా నగదు కావాల్సి ఉండడంతో బాధిత కుటుంబం దాతల సాయం కోరుతోంది. నగదు సాయం చేయాలనుకున్న వారు 78932 33278 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేస్తోంది.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.65
సన్నవి	రూ.50
పండు	రూ.35

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	138	బ్రాయిలర్ స్కిన్‌లెస్	274
లేయర్ (లైవ్)	110		
బ్రాయిలర్ చికెన్	246	లేయర్ చికెన్	187

తిరుపతికి కండలేరు జలాల విడుదల

రాపూరు: తిరుపతి ప్రజల దాహార్తి తీర్చేందుకు కండలేరు జలాలను ఆదివారం నుంచి విడుదల చేసినట్లు తెలుగుగంగ ఎస్ఈ వెంకటరమణారెడ్డి తెలిపారు. కండలేరు జలాశయం పంపింగ్ స్పాట్ వద్ద మట్టికట్టను తొలగించి సాయంత్రం 4 గంటలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 15వ తేదీన జలాశయంలో నీటి మట్టం తగ్గడంతో విడుదల నిలిపివేశామని చెప్పారు. ప్రస్తుతం తిరుపతి నగరంలో నీటి ఎద్దడి తలెత్తడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కండలేరు నుంచి నీటిని విడుదల చేశామన్నారు. పూడిక తీసేందుకు తిరుపతి కార్పొరేషన్ రూ.85 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. 30 రోజులపాటు, రోజుకు 250 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తామని తెలిపారు. ఈ నీరు శ్రీకాళహస్తి సమీపంలోని 88 కిలోమీటర్ వద్ద ఉన్న రామాపురానికి చేరుతుందని అక్కడి నుంచి పంపింగ్ ద్వారా తిరుపతికి చేరవేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియను ఈఈ విజయకుమార్‌రెడ్డి, తిరుపతి మున్సిపాలిటీ డీఈ రాజు, ఏఈలు తిరుమలయ్య, కృష్ణారెడ్డి, సిబ్బంది పరిశీలించారు.

నేటి నుంచి పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్'

- ఎన్ఈపీకి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కార్యక్రమాలు
- 29వ తేదీ వరకు నిర్వహణ
- విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరి



దుత్తలూరు మండలంలోని పాఠశాల

దుత్తలూరు: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి ఈనెల 29 వరకు శిక్షా సప్తాహ్ పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)– 2020 ప్రవేశపెట్టి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించాలని సమగ్ర శిక్ష అధికారులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 2,039 ప్రాథమిక, 245 ప్రాథమికోన్నత, 340 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటితోపాటు 812 కార్పొరేట్, ప్రైవేట్ బడులున్నాయి. కార్యక్రమాలను మొక్కుబడిగా కాకుండా చిత్తశుద్ధితో నిర్వహించాలని విద్యాశాఖ నుంచి అన్ని పాఠశాలలకు, ఎంఈఓ కార్యాలయాలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఏం చేస్తారంటే..

➡ 22న స్థానికంగా లభించే వనరులతో అభ్యసన సామగ్రిని తయారు చేసి ప్రదర్శించాలి. దీనికి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజలను ఆహ్వానించాలి.

➡ 23న పునాది అభ్యసన కార్యక్రమంలో భాగంగా ఒకటో తరగతి నుంచి భాషపై విద్యార్థులు మంచి పట్టు సాధించేలా చేయడం, గణితంలోని సంఖ్యా శాస్త్రంపై పట్టు సాధించేందుకు చర్చల ద్వారా అవగాహన కల్పించడం.

➡ 24న వివిధ క్రీడలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించాలి. శారీరక సౌష్టవం ప్రాముఖ్యత తెలిసేలా ఈ పోటీలుండాలి.

➡ 25న భిన్నత్వంలో ఏకత్వం భావనను విద్యార్థులలో పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి. ప్రధానంగా క్లాసికల్, నృత్య ప్రదర్శన, పాటల పోటీలు, నాటిక ప్రదర్శనలు తదితర కార్యక్రమాలు నిర్వహించాలి.

➡ 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవంలో భాగంగా విద్యలో సాంకేతిక అభివృద్ధిని గుర్తించేలా చర్యలు జరపాలి. ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకొని తరగతి గదుల సౌకర్యాలు మెరుగుపరచుకుని డిజిటల్ విద్య కార్యక్రమాలకు అవసరమయ్యే నూతన నైపుణ్యాలను గుర్తించడం.

➡ 27న పర్యావరణ పరిరక్షణలో భాగంగా మిషన్ లైఫ్ యాక్టివిటీస్, న్యూట్రిషన్ డే, కొత్తగా ఎకో క్లబ్స్ ఏర్పాటు, అమ్మకు అంకితం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, తల్లులతో కలిసి మొక్కలు నాటడం, మాతృభూమి మధ్య బంధం పెంచడానికి ప్రతి పాఠశాలలో తల్లీబిడ్డలతో కలిసి 35 మొక్కలు నాటాలి.

➡ 29న సామాజిక భాగస్వామ్య దినోత్సవంలో భాగంగా ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కమిటీలను ఏర్పాటు చేయాలి. ఉపాధ్యాయ సంఘాల సహకారంతో వివిధ కార్యక్రమాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలి.

ప్రతి బడిలో నిర్వహించేలా చర్యలు



సమగ్ర శిక్ష ఉన్నతాధికారుల ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. విధి విధానాల గురించి క్షేత్రస్థాయి సిబ్బందికి వివరించాం. కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అందరం కృషి చేస్తాం.
– సీహెచ్ ఉషారాణి, ఏపీసీ, జిల్లా సమగ్ర శిక్ష